సాక్షి కామారెడ్డి

శనివారం । 13 । జూలై । 2024



పూర్వవైభవం తథ్యం

జీఆర్ఎస్ పార్టీకి త్వరలోనే పూర్వవైభవం వస్తుందని మాజీ ప్రభుత్వ విప్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు.

- 8లో ▸



మెనూ ప్రకారం..

మండలాల ప్రత్యేకాధికారులు శుక్రవారం విద్యాసంస్థలను సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

- 9లో ▸



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పరీక్షలు వాయిదా వేయాలని ధర్నా



భిక్కనూరు: పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థులు శుక్రవారం ధర్నా చేశారు. సెమిస్టర్ పరీక్ష షెడ్యూల్ సమయంలోనే డీఎస్సీ పరీక్షతో పాటు మరో రెండు వారాల్లో గ్రూప్–2 పరీక్ష ఉన్నాయని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వర్సిటీ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రెండు వారాల పాటు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు.

గట్టుమీది గ్రామాల్లో జ్వర సర్వే పరిశీలన



బాన్సువాడ రూరల్: మండలంలోని గట్టుమీది గ్రామాలైన కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఆర్డీవో రాథోడ్ రమేశ్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలి ప్రజలు మంచం పట్టారు. రోజుల తరబడి వైద్యం చేయించుకుంటున్నా జ్వరాలు తగ్గకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్ శుక్రవారం వివిధ గ్రామాల్లో పర్యటించారు. కోనాపూర్‌లో కొనసాగుతున్న జ్వర సర్వేను, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, క్లోరినేషన్ చేసిన నీటినే అందించాలని కార్యదర్శి రాజేశ్ కుమార్‌ను ఆదేశించారు. జ్వరాలు తగ్గేవరకు అస్పత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి ఉన్నారు.


15న పెన్షన్ అదాలత్

సుభాష్‌నగర్: ఉద్యోగుల పెన్షన్ స్కీంకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు పెన్షన్ అదాలత్‌ను ఈనెల 15న ఉదయం 11 గంటల నుంచి 11.40 గంటల వరకు నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్–1 గణేశ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కారానికి సంబంధించి ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2641 582 8976, పాస్‌వర్డ్ పీడీఎస్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

'గిరిరాజ్' డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల డిగ్రీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ, కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. మే నెలలో నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

భిక్కనూరు మండలం కాచాపూర్ శివారులో వాడిపోతున్న మొక్కజొన్న పంట



కరువు మేఘం కమ్మేసింది

- జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప వర్షపాతం నమోదు
- సాధారణం కన్నా 20 శాతం లోటు
- మరింత లోతుకు భూగర్భ జలమట్టం
- ఆందోళన చెందుతున్న రైతాంగం

సాక్షి, కామారెడ్డి: వర్షాకాలం సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు కురవలేదు. దీంతో సాధారణంకన్నా 20 శాతం లోటుతో రాష్ట్రంలోనే అత్యల్ప వర్షపాతం నమోదైన జిల్లాగా నిలిచింది. జిల్లా అంతటా కరువు మేఘాలు కమ్ముకోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నమోదైన వర్షపాతం లెక్కలను పరిశీలిస్తే కామారెడ్డి జిల్లా 33 వ స్థానంలో ఉంది. వర్షాలపైనే ఆధారపడి సేద్యం చేసే కామారెడ్డి జిల్లా రైతాంగం ఎన్నడూ లేనంత కరువు పరిస్థితులను ఎదుర్కొంటోంది. వర్షాలు కురవక, వాగులు పొంగకపోవడంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి. గతేడాది జూన్‌లో 11.90 మీటర్ల లోతుల్లో ఉన్న భూగర్భజలాలు, ఈసారి 14.46 మీటర్లకు పడిపోయింది. ఈ పదిరోజుల్లో మరింతగా పడిపోయి ఉంటుందని జిల్లా భూగర్భజలశాఖ అధికారి సతీష్‌యాదవ్ 'సాక్షి'తో పేర్కొన్నారు. గతేడాది జూన్ కన్నా, ఈ ఏడాది జూన్‌లో 2.50 మీటర్ల లోతుల్లోకి భూగర్భజలమట్టం పడిపోయింది. ఈ పది రోజుల్లో మరో అర మీటర్ లోతుల్లోకి పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రతినెల 15 తర్వాత భూగర్భజలమట్టాన్ని లెక్కిస్తారు. సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 216 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, 173 మి.మీ. మాత్రమే నమోదైంది. సాధారణం కన్నా 20 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం కరువు పరిస్థితులకు అద్దం పడుతోంది. జిల్లాలోని పెద్దమల్లారెడ్డి, దోమకొండ, బీబీపేట, బీర్కూర్, పిట్లం, రామారెడ్డి, జుక్కల్, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం 22 మీటర్ల లోతుల్లోకి పడిపోయింది. గత యాసంగి సీజన్‌లో వేలాది బోర్లు ఎత్తిపోయాయి. ఈ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో ఎత్తిపోయిన బోర్లు కుదురుకోకపోగా, అక్కడక్కడా పోస్తున్న మిగతా బోర్లు కూడా ఎత్తిపోయి ఇబ్బందికరంగా మారాయి. కనీసం నారుమడులకు నీరు పారించలేని పరిస్థితి నెలకొంది.

పంటల సాగుపై నీలినీడలు..

రోజూ కమ్ముకొస్తున్న మేఘాలను చూసి రైతులు ఆశతో ఆకాశానికేసి చూడడం, కాసేపటికే మేఘాలు మాయం అవడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. సీజన్ మొదలై నెలన్నర కావస్తున్నా జిల్లాలో భారీ వర్షాలు లేకపోవడంతో వానాకాలం సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ సారి 5,14,686 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో 80 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. 3.13 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటివరకు లక్షా 25 వేల ఎకరాలకు సరిపడా నారుమడులు పోసినట్టు వ్యవసాయ శాఖ తెలిపింది. నాట్లు కేవలం పదిహేను వేల ఎకరాల్లో మాత్రమే వేశారు. మెట్టం ప్రాంతంలో ఏటా మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ సారి గతంలో లాగే 60 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. సీజన్ ఆరంభంలో కురిసిన జల్లులతో మక్క విత్తనాలు వేస్తారు. కానీ ఈ సారి కురిసిన వర్షాలతో కనీసం నేల పూర్తి స్థాయిలో తడవకపోవడంతో కొద్దిమంది రైతులు మాత్రమే మక్క వేశారు. వేసినది కూడా ఎండుముఖం పడుతోంది. పత్తి, కంది, సోయా, పప్పుదినుసుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. మరో పది పదిహేను రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటే వానాకాలం సాగు మీద ఆశలు వదులుకోవలసిందేనని రైతులు అంటున్నారు.

పల్లెబాటకు కలెక్టర్ సన్నద్ధం!

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును పరిశీలించేందుకు..
- తొమ్మిది అంశాలపై ఫోకస్ చేయాలన్న సర్కారు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

సాక్షి, కామారెడ్డి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ క్షేత్రస్థాయి పర్యటనలకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా? అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయా? తదితర విషయాలను తెలుసుకునేందుకు గ్రామాలు, పట్టణాలలో పర్యటించనున్నారు. కలెక్టర్లు తరచుగా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వెలుబడ్డాయి. కలెక్టర్లు తరచుగా పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ఫీల్డ్ విజిట్స్ నిర్వహించాలని అందులో పేర్కొన్నారు.

సీఎంతో సమావేశం తర్వాత..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 16న కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం కానున్నారు. ప్రజాపాలన, ధరణి, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతిభద్రతలు, యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ సీఎం సమావేశానికి కావలసిన నివేదికలను సిద్ధం చేసుకుంటున్నారు. ఆ సమావేశం తర్వాత కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లనున్నారు. కాగా ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులను స్వయంగా కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనల్లో పరిశీలించనున్న నేపథ్యంలో మార్పు వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ సంగ్వాన్ పలు ప్రాంతాలను చుట్టేసి వచ్చారు. కలెక్టరేట్‌లో సమయపాలన పాటించడంలో భాగంగా బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేసి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. దీంతో ఉద్యోగులు, అధికారులు సకాలంలో విధులకు హాజరవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు మొదలవుతున్నాయి. కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనలతో అధికారుల్లో మార్పు వస్తుందని భావిస్తున్నారు.

పరిశీలించే అంశాలు..

- కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. సబ్‌సెంటర్/ప్రాథమిక ఆరోగ్య కేంద్రం/కమ్యూనిటీ హెల్త్‌సెంటర్/జిల్లా ఆస్పత్రులను తనిఖీ చేసినప్పుడు వైద్య సేవలను పరిశీలించాల్సి ఉంటుంది. అలాగే మందుల లభ్యత, సౌకర్యాలను అడిగి తెలుసుకోవాలి. మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తే.. నాణ్యమైన విద్య అందుతుందా లేదా అన్నది పరిశీలించాలి. ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి, వారికి సూచనలివ్వాలి. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- గ్రామాలు/పట్టణాల్లో తాగునీటి సరఫరాతో పాటు పారిశుధ్య పరిస్థితులను పరిశీలించాలి. తాగునీటికి ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. వ్యవసాయానికి సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. రోడ్లు, ప్రజారవాణా, ఇతర సౌకర్యాలను కూడా పరిశీలించాలి. సామాజిక సంక్షేమ పథకాలు ముఖ్యంగా పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నాయో లేదో తెలుసుకోవాలి. వృద్ధులు, వికలాంగులు, వితంతు ఫింఛన్లకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే పరిష్కరించాలి. పట్టణ ప్రాంతాల్లో అయితే సానిటేషన్, నీటి సరఫరా, టౌన్‌ప్లానింగ్ తదితర విషయాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. పరిశీలనలకు వెళ్లిన సందర్భంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి.

'కొత్త సర్వీస్ రూల్స్ సాధించడమే లక్ష్యం'



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయులకు కొత్త సర్వీస్ రూల్స్ సాధించడమే లక్ష్యమని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సర్వీస్ రూల్స్ వస్తే అర్హత ఉన్న ఉపాధ్యాయులకు అనేక ప్రమోషన్లు లభిస్తాయన్నారు. కొత్త సర్వీస్ రూల్స్‌తోపాటు సీపీఎస్ విధానం రద్దు, కేజీవిబీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు, వేతనాల అంశాలను సీఎంకు వివరించామన్నారు. బదిలీ అయినా రిలీవర్ లేక అక్కడే పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు నిరాశతో ఉన్నారన్నారు. డీఎస్సీ అనంతరం సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో వచ్చే నెల నుంచి స్కావెంజర్లను నియమిస్తారన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ టీచర్లు, బదిలీ అయినా రిలీవ్ కాలేకపోయిన టీచర్లు, వివిధ సమస్యలపై వచ్చిన ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించి, తమ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు, కార్యదర్శి లక్ష్మీరాజం, గణిత ఫోరం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి
- బల్దియా సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన చైర్‌పర్సన్ ఇందుప్రియ



వార్డు సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్ వనిత

కామారెడ్డి టౌన్: పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కౌన్సిలర్లు, అధికారులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులు పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాతలను ఆదేశించారు. బల్దియాలో ఆక్రమణలు, కబ్జాలను తొలగించాలని, అనుమతి లేకుండా నిర్మిస్తు న్న భవన నిర్మాణాల పనులను నిలిపివేయాలని, ఇందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పచ్చదనం కోసం ప్రతి ఇంటింకి మొక్కలను సరఫరా చేయాలన్నారు. కౌన్సిల్ సభ్యుల సహకారంతో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ప్రకటన పన్నులతో ఆదాయం పెంచుకుని పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పట్టణంలోని మురికి కాలువలను శుభ్రం చేయించేందుకు పొక్లెయిన్‌ల నిర్వాహకులకు రూ. 30 లక్షల వరకు ఖర్చు చేశారని, దీనికి బదులు పొక్లెయిన్ వచ్చేదని కౌన్సిల్ సభ్యులు పేర్కొన్నారు. రూ. 30 లక్షల ప్రజాధనం వృథా చేశారని, బిల్లులపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో 25 ఎజెండా అంశాలపై సభ్యులు చర్చించారు. 31వ వార్డులో నీటిని సరఫరా చేయకున్నా రూ. 1.40 లక్షల బిల్లు పెట్టడంతో ఆ అంశాన్ని వాయిదా వేసి, మిగతా అంశాలకు ఆమోదం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన పనులు తీసుకోకూడదని, కళాభారతి ఆడిటోరియాన్ని 2 ఏళ్ల పాటు అద్దెకు ఇచ్చేందుకు, శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసేందుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ సుజాత, వైస్ చైర్‌పర్సన్ ఉర్దొండ వనిత, కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.







- దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు
- 56 రకాల నైవేద్యాల సమర్పణ
- అలరించిన విద్యార్థుల వేషధారణ

ఘనంగా జగన్నాథ రథయాత్ర



నిజామాబాద్‌అర్బన్: ఇందూర్ నగరంలో ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్ర కనుల పండువగా జరిగింది. నీలకంఠేశ్వరాలయం నుంచి నగరంలోని విజయలక్ష్మి గార్డెన్ వరకు నిర్వహించిన యాత్రకు వేలాది మంది భక్తులు తరలిరాగా భక్తిశ్రద్ధలతో రథయాత్ర సాగింది. ఒడిశాలోని ప్రఖ్యాత పూరి క్షేత్రంలోని జగన్నాథ బలదేవ్ సుభద్రమయ సుదర్శన చక్ర రథయాత్ర అంటే ఎంతో ప్రసిద్ధి.. దీనిని ప్రతియేటా నగరంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నగరంలోని రథయాత్రకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జగన్నాథునికి 56 రాకల నైవేద్యాలు సమర్పించారు. భజనాలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, రాధ వేషధారణతో అలరించారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్ తాడు లాగి ర్యాలీలో పాల్గొన్నారు. మహా హారతి, మహా ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదవ్ స్వామి యాదవ్, ఇస్కాన్ ప్రతినిధులు రఘు, ఆదిపురుషందన్, అశోక్ నీలైదాస్, నీతైచందుదాస్, ఆదిగురుదాస్, రమణ గోపీ దాస్, సర్వానత్ ప్రభు, నవరూప ముకుంద దాస్, సునీల్ అక్షయ్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షులు రామ నందరాయ్ గౌరదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార శివకుమార్ పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళం

- పూర్తి స్థాయిలో ఖాళీలు చూపించని అధికారులు
- అయోమయంలో వైద్యశాఖ ఉద్యోగులు



కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న బదిలీల ప్రక్రియలో గందగోళం నెలకొంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఖాళీలను జాబితాలో చూపించలేదు. దీంతో బదిలీల కోసం ఆప్షన్‌లు ఇచ్చిన ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు. సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సీనియారిటీ జాబితా ప్రకటించి కేవలం 40 శాతం ఉద్యోగులకు మాత్రమే బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కేవలం 15 ఖాళీలను మాత్రమే ప్రకటించారు. చాలా పీహెచ్‌సీలలో ఖాళీలను చూపకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు.

జిల్లా క్యాడర్ పోస్టులకు సంబంధించి ఏఎన్ఎం, జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లు, జోనల్ క్యాడర్ పోస్టులకు సంబంధించి డీఎంహెచ్‌వోల నుంచి స్టాఫ్ నర్సుల పోస్టుల వరకు బదిలీలు చేయనున్నారు. జిల్లా క్యాడర్ ఖాళీల వివరాలను జిల్లా అధికారులు రాష్ట్ర వైద్యశాఖకు సమర్పించారు. జోనల్ ఖాళీలను రాష్ట్ర వైద్యశాఖ ప్రకటించింది. చాలా ఖాళీలను ఆయా జాబితాలలో చూపలేదని వైద్య శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ విషయమై శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. రాజంపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్ పోస్టు ఖాళీగా ఉన్నా ఖాళీల జాబితాలో చూపకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఇలా చాలా పోస్టులను ఖాళీల జాబితాలో చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొంత మంది ఆన్‌లైన్‌లో వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరికొందరు కోర్టుకు వెళ్తామని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో ఖాళీలను ప్రకటించాకే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

22లోగా బీఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ రెగ్యులర్ నాలుగో సెమిస్టర్, 2020–21 విద్యాసంవత్సరం 1, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 22 తుది గడువని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 23వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ వన్‌టైం చాన్స్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఒకరు డిబార్ అయినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు పేర్కొన్నారు. ఉదయం జరిగిన డిగ్రీ 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 111 మంది విద్యార్థులకు 102 మంది, మధ్యాహ్నం పరీక్షకు 226 మంది విద్యార్థులకు 216 మంది హాజరయ్యారు.

ఇంటర్ కాలేజీల తనిఖీ



నందిపేట్/మాక్లూర్: నందిపేట మండలం ఐలాపూర్, మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలను శుక్రవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ పరిశీలించారు. గత సంవత్సరం ఫలితాలపై ఆరా తీశారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు రాలేవని, అధ్యాపకులు గ్రామాలకు వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు. మూత్రశాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్స్ పెద్ది నారాయణ, గంగారాం పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. ప్రాజెక్ట్‌లోకి 400 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి అంతే స్థాయిలో ఔట్‌ఫ్లో ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1061.90(12.44 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

బాధ్యతతో మొక్కలు నాటాలి



ముంబోజీపేట శివారులో మొక్కలు నాటుతున్న అధికారులు



తిమ్మక్‌పల్లిలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో రంగనాథ్

పిట్లం(జుక్కల్) : మండలంలోని కంభాపూర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ ఆరు మొక్కలను జీపీ సిబ్బంది పంపిణీ చేశారు. జీపీ కార్యదర్శి అంబాయ్య మొక్కలు తీసుకున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్ల వద్ద ఇంటి వద్ద, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కంభాపూర్‌లో..

తిమ్మక్‌పల్లిలో..

కామారెడ్డి అర్బన్ : మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కామారెడ్డి ఆర్డీవో, కామారెడ్డి మండల పరిషత్ ప్రత్యేక అధికారి వై రంగనాథ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మక్‌పల్లిలో వనమహోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎండీవో మలహరి, ఐకేపీ ఏపీఎం మోయిజ్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముంబోజిపేట తండా భవానిపేట, కొండాపూర్ తదితర జీపీల్లో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీవో నరేష్ మాట్లాడుతూ 41 జీపీల్లో మొక్కలు నాటించామన్నారు. ఎంపీడీవో నరేష్, మాజీ ఎంపీటీసీ సర్వన్, కార్యదర్శి పవన్, క్షేత్రసహాయకుడు సాయాగౌడ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తథ్యం



మాజీ జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, మాజీ ఎంపీటీసీలను సన్మానిస్తున్న మాజీ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న విషయాన్ని ప్రజలు గ్రహించారని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పద్మ నాగభూషణంగౌడ్‌తో పాటు ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గుడిసె యాదగిరితో పాటు బీఆర్‌ఎస్ మాజీ ఎంపీటీసీలను ఆయన సన్మానించారు. ఐదేళ్ల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేశారని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి పూర్వవైభవం తథ్యమన్నారు. కేసీఆర్ మాట ఇచ్చాడంటే అమలు చేసి తీరుతాడని ప్రజలు గుర్తించారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని నిజమైన బీఆర్‌ఎస్ నేతలు కార్యకర్తలు ఎవరో ప్రజలకు పార్టీ అధిష్ఠానానికి అర్థం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్‌లు ఏనుగు వెంకట్‌రెడ్డి, నాగార్తి భూంరెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు అందే మహేందర్ రెడ్డి, వంగేటి చిన్న నర్సరెడ్డి, వంగేటి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, మెంగారం ప్రాథమికోన్నత, కోర్పోల్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి రాజు పరిశీలించారు. హెచ్‌ఎం రవీందర్‌శర్మ, వాసంతి, సుధాకర్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు మేహర్ తదితరులున్నారు.

యూనిఫాంలు అందించాలి



నిజాంసాగర్(జుక్కల్) : ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం పరంగా రెండు జతల యూనిఫామ్స్‌ను అందజేస్తున్నామని మండల ప్రత్యేక అధికారి విజయ్‌భాస్కర్ సూచించారు. ఐకేపీలో కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో యాదగిరి ఉన్నారు.

మరణిస్తూ నలుగురికి జీవితం

- యువకుడి బ్రెయిన్‌డెడ్
- అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



ప్రవీణ్ (ఫైల్)

భిక్కనూరు: తాను చనిపోతూ మరో నలుగురికి జీవితాన్ని ఇచ్చాడు భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన మెట్టు ప్రవీణ్ (27). ప్రవీణ్ మెదక్ జిల్లా రామాయంపేటలోని ఓ బేకరిలో పనిచేసేవాడు. ఈ నెల 12న విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రవీణ్ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. అవయవదానం చేయడంతో నలుగురికి మేలు కలుగుతుందని వైద్యులు ప్రవీణ్ కుటుంబీకులకు తెలిపారు. జీవన్‌దాన్ ట్రస్టు ప్రతినిధులు ఆస్పత్రికి వచ్చి చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు అవయవదానానికి ఒప్పుకున్నారు. దీంతో కిడ్నీలు, లివర్, కార్నియ, ఊపిరితిత్తులను సేకరించారు. దీంతో ఆస్పత్రిలో ప్రవీణ్ మృతదేహం వద్ద వైద్యులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు. ప్రవీణ్‌కు భార్య రేఖ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



ప్రవీణ్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్య సిబ్బంది

పూలు చల్లుతూ..

అవయవదానం చేసిన ప్రవీణ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో పెద్దమల్లారెడ్డికి తీసుకు వచ్చారు. గ్రామానికి చెందిన యువకులు గ్రామశివారులో నుంచి అంబులెన్స్‌పై పూల వర్షం కురిపిస్తూ ఆయన ఇంటి వరకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. గ్రామంలో నిర్వహించిన అంతిమ యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలంలో ముగ్గురు

భిక్కనూరు మండలంలో ఇప్పటి వరకు ముగ్గురి అవయవాలు దానం చేశారు. భిక్కనూరుకు చెందిన బొందుగుల మాధురిలక్ష్మి అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురవగా ఆర్గాన్స్ డొనేట్ చేశారు. పెద్దమల్లారెడ్డికి చెందిన శారద బ్రెయిన్‌డెడ్‌కు గురవగా కుటుంబ సభ్యులు అవయవదానం చేశారు. తాజాగా ప్రవీణ్ అవయవాలను దానం చేశారు.

నాన్ లేఅవుట్ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



సుభాష్‌నగర్: నగరంలోని మైనారిటీ ఏరియాల్లో నాన్ లేఅవుట్ వెంచర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, పదేళ్లుగా దందా కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, మున్సిపల్ అధికారులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఖైసర్ మాట్లాడుతూ.. బోధన్‌రోడ్‌తో పాటు మైనారిటీ ఏరియాలో అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తున్నారని, ఎంఐఎం నాయకులు ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాన్ లే అవుట్ వెంచర్లతో ఏరియాలో పార్కులు, లైబ్రరీలు, హెల్త్ సెంటర్లు, క్రీడా మైదానాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. స్లాటర్ హౌజ్ పక్కన బ్రహ్మం చెరువును ఎంఐఎం నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. రామర్తి చెరువు స్థలంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నాయకులు ఏజాజ్, మహమూద్, సర్జిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయోపరిమితి పెంచాలి



సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు గడ్డం మల్లేశ్, ఈసీ మెంబర్లు

తెయూ(డిచ్‌పల్లి): యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో టౌటా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ యూనివర్సిటీల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యూజీసీ నిబంధనల మేరకు వయోపరిమితి 65 ఏళ్లకు పెంచాలని, పెండింగ్ బకాయిలను (ఆర్‌పీఎస్ –2016) వెంటనే చెల్లించాలని, యూనివర్సిటీల్లో పని చేసే ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో టౌటా అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం మల్లేశం, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, చల్లమల్ల వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్రీనివాస్, ప్రొఫెసర్ వనజ ఉదయ్(పీఎస్‌టీయూ), బి విద్యాసాగర్ (పీజేటీఎస్‌ఏయూ), బి మంగు (ఓయూ), డాక్టర్ పున్నయ్య (తెయూ), సరస్వతమ్మ (టీఎంవీ), ఎస్ నర్సింలు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్‌లో పాము కలకలం



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో శుక్రవారం పాము కలకలం సృష్టించింది. సోషల్ వర్క్ విభాగంలో ఉన్న మరుగుదొడ్డి ప్రాంతంలో పాము కనిపించడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే జంగంపల్లి గ్రామానికి చెందిన చెన్నప్పగారి రాంరెడ్డికి ఈ విషయాన్ని తెలియజేయగా ఆయన వచ్చి పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్యుడు అరుణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌టీఈలు చిన్నసాయిలు, సునిల్, రాజు తదితరులు ఉన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో..

పిట్లం(జుక్కల్) : పిట్లం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ వారు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు భాస్కర్ రెడ్డి 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కాశీరెడ్డి, జోన్ చైర్మన్ కిషన్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

చీరతో ఉరిపడి బాలుడి మృతి



ఎడపల్లి: చీరతో ప్రమాదవశాత్తు ఉరి పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఠాణాకలన్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన టీకులపల్లి నవదీప్(14) ఇంట్లోని సామగ్రిని సజ్జ(సెల్ఫ్) మీద పెట్టడానికి అక్కడ కట్టిన ఊయలలాగా కట్టిన చీరపై ఎక్కాడు. సామను సర్దుతుండగా కింద పడగా చీరతో ఉరి పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేరు. తర్వాత నవదీప్ తల్లి ఇంట్లోకి వచ్చి చూసే సరికి ఉరి పడి ఉండటంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడు..



గాంధారి: మండలంలోని నేరల్‌లో కరెంట్ షాక్‌తో హరిజన నవీన్(27) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ తిరగడం లేదని నవీన్ స్టూలుపై ఎక్కి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



నిజాంసాగర్: మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన అడ్డగళ్ల సాయిలు(22) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. అడ్డగళ్ల ఉమలత, సంజీవుల పెద్ద కుమారుడైన సాయిలు ఇంటర్ వరకు చదివాడు. నెల క్రితంహైదరాబాద్ వెళ్లి ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చిన సాయిలు శుక్రవారం తెల్లవారు జామున గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

మాక్లూర్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అమ్రాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పూల శ్రవణ్‌కుమార్(36) రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం నర్సింగ్ కాలేజీ దగ్గరలో అటవీ ప్రాంతంలో ఆయన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. కుటుంబ సమస్యలతో ఉరి వేసుకున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని మహిళకు గాయాలు

బాన్సువాడ: ఉదయం వాకింగ్ చేస్తున్న మహిళను వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం శారద, సాహిత్య ప్రియ అనే ఇద్దరు వాకింగ్ చేస్తుండగా వెనకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి వాహనంతో సాహిత్య ప్రియను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని సీఐ కృష్ణ తెలిపారు. ఆమె సోదరుడు నాగభూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అటవీ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



అటవీ భూమిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులోగల రేనులకుంట మైసమ్మ వద్ద అటవీ భూమిలో చెట్లు నరికేసి సాగు చేస్తుండటంపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, బీట్ ఆఫీసర్ సాయికుమార్ ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. వివరాలు.. మంచిప్ప శివారులోని రేనులకుంట మైసమ్మ వద్ద అటవీ భూమిలో అమ్రాబాద్ తండాకు చెందిన పలువురు చెట్లు నరికి సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈవిషయమై మంచిప్ప గ్రామస్తులు సెక్షన్, బీట్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కానీ ఇటీవల మంచిప్ప గ్రామస్తులు రాజులమర్రి గుట్ట వద్ద అటవీభూమిలో మొక్కజొన్న సాగు చేయగా, అమ్రాబాద్‌వాసులు వాటిని ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అమ్రాబాద్ గ్రామస్తులు అటవీ భూమిలో సాగు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మంచిప్ప గ్రామస్తులు మండిపడుతున్నారు. దీనిపై మంచిప్ప గ్రామస్తులు ఎఫ్ఆర్‌ఓ రాధికకు ఫిర్యాదు చేయగా, ఆమె ఆదేశాల మేరకు సెక్షన్, బీట్ ఆఫీసర్లు, వీడీసీ ప్రతినిధులు చెట్లు నరికేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. వారి నివేదిక ఆధారంగా అటవీశాఖ చట్టం ప్రకారం చెట్లు నరికేయడమే కాకుండా భూమిని సాగు చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎఫ్ఆర్‌ఓ రాధిక తెలిపారు.

అటవీ భూమిపై పంచాయితీ

మండలంలోని మంచిప్ప, అమ్రాబాద్ గ్రామాల మధ్య అటవీ భూమిపై పంచాయితీ మొదలైంది. రేనులకుంట మైసమ్మ, రాజులమర్రి గుట్ట రెండూ మంచిప్ప శివార్లలో ఉన్నప్పటికీ.. ఇరు గ్రామాల ప్రజలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. అటవీ భూమిని సాగు చేయడం, చెట్లు నరికేయడం తప్పుగా భావించి అధికారులు కేసులు నమోదుచేశారు.

మక్క పంట ధ్వంసం చేసిన వారిపై కేసు



ధ్వంసమైన పంటను పరిశీలిస్తున్న ఎస్సై

గాంధారి: మండలంలోని సోమారం తండాకు చెందిన రైతు మొక్కజొన్న పంటను కొత్తాబాది తండాకు చెందిన రైతులు ధ్వంసం చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు.. కొత్తాబాది తండా, సోమారం తండా శివారులో 754 కంపార్ట్‌మెంటులో మూడు ఎకరాల అటవీ భూమి పట్టాను సోమారం తండాకు చెందిన బాదావత్ దన్నుబాయికి ప్రభుత్వం ఇచ్చింది. ఈ భూమి విషయంలో ఇరు తండాల రైతులు గతంలో గొడవపడి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసుకున్నారు. ఆ ఫిర్యాదును ఎస్సై రెవెన్యూ, అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు విచారణ చేసి సదరు భూమిని దన్నుబాయికి ఇచ్చినట్లు నిర్ధారించారు. అధికారులు ఇరు తండాల రైతులను రాజీ కుదిర్చిపంపారు. హక్కు పత్రం ఉన్న దన్నుబాయి ఆ భూమిలో 20 రోజుల క్రితం మొక్కజొన్న సాగు చేశారు. గురువారం రాత్రి కొత్తాబాది తండా రైతులు ట్రాక్టర్లతో మొక్కజొన్న పంటను దున్నేశారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలు

ఎల్లారెడ్డి: బైక్ చోరీకి పాల్పడిన ముగ్గురికి ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక ఐదు నెలల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. మండలంలోని అడివిలింగాలకు చెందిన కుమ్మరి రాజు బైక్‌ను నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్‌కు చెందిన దొడ్ల గోపాల్, ఎర్ర అశోక్, ఆత్మకూర్ గ్రామానికి చెందిన మిద్దె రాజు కలిసి మార్చి 28న చోరీ చేశారు. న్యాయమూర్తి దొంగలకు ఐదు నెలల జైలు శిక్ష విధించారు.

ఎల్లారెడ్డిలో బైక్ దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని శ్రీరామ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు బైకు దగ్ధం చేశారు. పట్టణంలోని ముబీన్ తన బైక్‌ను రాత్రి ఇంటి ఆవరణలో నిలిపాడు. ఆ బైక్‌ను దుండగులు కాలబెట్టారు.

బాగుంటుందని రైలెక్కేశారు..

- ఇద్దరు పిల్లల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు
- మహబూబ్‌నగర్‌లో లభ్యమైన పిల్లల ఆచూకీ



ఉమేర్, ఆసిఫ్

కామారెడ్డి క్రైం: ఇద్దరు చిన్నారుల మిస్సింగ్ ఉదంతం ఎట్టకేలకు సుఖాంతమైంది. రైలు ప్రయాణంపై వారికున్న ఆసక్తి రెండు కుటుంబాలను దాదాపు ఒక రోజు పాటు ఆగం చేసింది. పిల్లల ఆచూకీ దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆసిఫ్ (8), ఉమేర్ (12) అనే ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే ఓ మదర్సాలో చదువుకుంటున్నారు. గురువారం సాయంత్రం వారు ఇంటికి తిరిగి రాలేదు. మదర్సాకు వెళ్లి చూడగా అక్కడ కూడా లేరు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకక పోవడంతో వారి తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం 6 గంటలకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఉమేర్ తండ్రి బాబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దేవునిపల్లి పోలీసులు పిల్లల కోసం వెతకడం ప్రారంభించారు. బంధువులు, అంతా కలిసి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి వారు ఇద్దరూ మహబూబ్‌నగర్‌లో బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్నట్లు కామారెడ్డి పోలీసులకు సమాచారం వచ్చింది. మహబూబ్‌నగర్ రైల్వే ప్లాట్ ఫాంపై తచ్చాడుతున్న వారిద్దరిపై అనుమానం వచ్చి విచారించిన రైల్వే పోలీసులు అక్కడి బాలల సంరక్షణ కేంద్రంలో చేర్పించడంతో పాటు కామారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు క్షేమంగా ఉన్నట్లు నిర్ధారణ కాగా తల్లిదండ్రులు, బంధువుల ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఆసిఫ్ తన తండ్రితో కలిసి రైలులో ఢిల్లీ వరకు వెళ్లి వచ్చాడు. రైలు ప్రయాణం చాలా బాగుంటుందని ఉమేర్‌తో చెప్పగా అప్పటి నుంచి వారిలో రైలులో ప్రయాణించాలనే కోరిక పెరిగింది. ఇద్దరూ కలిసి రైలు ప్రయాణాన్ని ఆస్వాదించే ఉద్దేశంతోనే గురువారం సాయంత్రం కామారెడ్డి రైల్వే స్టేషన్ నుంచి ఓ గుర్తు తెలియని రైలు ఎక్కి మహబూబ్ నగర్ వరకు ప్రయాణం చేసినట్లు తెలుస్తుంది. కాగా దేవునిపల్లి పోలీసులు వారిని తీసుకువచ్చేందుకు మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. రెండు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉండటంతో సోమవారం పిల్లలను పోలీసులకు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.